క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గంగా భవాని కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సుప్రభాతం, ధ్వజారోహనం, అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, హనుమాన్‌హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, సభ్యులు పరమేశ్, అప్పి, సుధాకర్, లింగం, ఈశ్వరయ్య, యాదగిరి, లింగప్ప, అశోక్ ఉన్నారు.

రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని నందుపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ దేవి లంద ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి, లందకు మయిలలు తీసి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి గ్రామ పెద్దలు బోనాలు సమర్పించి డప్పు వాయిద్యాలతో శివ సత్తుల పూనకాలు, యువకుల నృత్యాలతో సందడి చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డి.నర్సింహ మాట్లాడుతూ ప్రజలందరిని ఆయురారోగ్యాలతో చల్లగా చూడాలని, సకాలంలో వర్షాలు కురిపించి పాడి పంటలు పండే విధంగా ఆశీస్సులు ఉండాలని కోరారన్నారు. ఈ కార్యక్రమంలో దేశపాగ నర్సింహ, బి.రాజు, జగదీష్‌గౌడ్, బి.రవి, ఇజాజ్, ఆర్.రవి, కె.సత్తయ్య, బి.సత్తయ్య, జి.చంద్రయ్య, ఆర్.వెంకటయ్య, ఎ.నర్సింహ, హబీబ్, జంగయ్య, జయేందర్, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

టీజీ ఎప్‌సెట్‌లో కీర్తన ప్రతిభ



బడంగ్‌పేట్: ఆదివారం విడుదల చేసిన టీజీ ఎప్‌సెట్–2025లో బడంగ్‌పేటకు చెందిన దళితబిడ్డ గుడ్ల కీర్తన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 2154 ర్యాంక్ సాధించి క్వాలిఫై అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి మంచి ర్యాంకు సాధించినందుకు తండ్రి గుడ్ల శ్రీనివాస్ అభినందించారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యాచారం: బీఆర్‌ఎస్ నాయకురాలు, నల్లవెల్లి మాజీ సర్పంచ్ శోభ, ఆమె భర్త బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాములు, పలువురు కార్యకర్తలు ఆదివారం నగరంలోని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌గౌడ్, యాచారం మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు మాధవి, అశోక్, చందన, కిశోర్, వైష్ణవి, ధృవాంశలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, సత్తయ్య, సాయికుమార్, మురళీధర్, పరమేశ్, సుధాకర్, లింగం, ఈశ్వరయ్య, లింగప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రోడ్డు గుంతలమయం

- మరమ్మతులు చేపట్టని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే దారి
- ప్రతీ మంగళవారం వేలాది మంది భక్తుల రాక
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రావిర్యాల ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు పరిస్థితి

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. అమ్మవారిని దర్శించుకోవడానికి ఈ ఆలయానికి వచ్చే భక్తులు, వాహనదారులు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. తుక్కుగూడ–సర్దార్‌నగర్ గ్రామాల నుంచి వచ్చే రోడ్డు, రావిర్యాల నుంచి పోయే రోడ్డు పూర్తిగా సింగిల్‌రోడ్డు. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిని కొనేళ్ల నుంచి అధికారులు మరమ్మతులు చేయక పోవడంతో పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు.

రద్దీగా మారుతున్న రహదారి..

ఈ రోడ్డు మీదుగా వ్యవసాయ పొలాలకు పోయే రైతులు, సర్దార్‌నగర్, తుక్కుగూడ గ్రామాలకు పోయే వారు, రియల్టర్లు బహుళ అంతస్తులు నిర్మించడంతో మెటీరియల్ సప్లయ్ చేసే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. మరోవైపు ప్రతీ మంగళవారం ఎల్లమ్మ ఆలయ దర్శనానికి జిల్లా నలుమూలనుంచి, నగరం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. దీంతో వాహనాల రద్దీ పెరగడంతో పాటు గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది.

నిత్యం ప్రమాదాలే..

ఈ రోడ్డు పూర్తిగా సింగల్ రోడ్డు కావడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుకు సమీపంలో రావిర్యాల చెరువు ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా పులిందర్ వాగు నుంచి చెరువులోకి నీరు పోయే బ్రిడ్జి కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏమౌతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి సింగల్ రోడ్డుకు మరమ్మతులు చేయించి, రోడ్డును విస్తరించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆలయ విస్తరణకు చర్యలు



లేమూరులో వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

కందుకూరు: మండలంలోని లేమూరు పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రముఖ స్తపతి శివనాగిరెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ విస్తరణకు చేయాల్సిన పనుల గురించి మాట్లాడారు. ప్రస్తుతం దేవాలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆలయ నిర్వాహకులు ఆయన్ని కోరారు. అందులో భాగంగా మహా మండపం, ధ్వజస్తంభం, బలిపీఠం, రాజగోపురం, కోనేరులను తిరిగి నిర్మించాల్సి ఉంటుందని ఆలయ నిర్వాహకులకు శివనాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట ఆలయ నిర్వాహకులు గూడూరు కొండారెడ్డి, ఢిల్లీ బాలకృష్ణ, రావిచెట్టు ఐలయ్య, ఢిల్లీ గణేష్, కేశిడి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్‌లో బెస్ట్ ఎడ్యుకేషన్



శ్రీజరెడ్డిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

హుడాకాంప్లెక్స్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్ నగర్ బ్రాంచ్‌లో పదోతరగతిలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ సంవత్సరం శ్రీజరెడ్డి 594 మార్కులతో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. అనంతరం స్కూల్ ఫౌండర్ చైర్మన్ కదారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 సంవత్సరాల క్రితం స్థాపించిన తమ పాఠశాలలో విలువలతో కూడిన బోధన అందిస్తున్నామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన శ్రీజరెడ్డితో పాటు ఉన్నతమైన మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కదారి మాధవి, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పద్మజారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కందుకూరు: ఊట్లపల్లి పరిధిలోని దేవునిగుట్టపై కొలువైన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో ఆదివారం వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. మొదటి రోజు వేద పండితులు మహాగణపతి పూజ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశణం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, దేవతాహ్వానం, మండల పూజలు, అంకురారోపణం, అగ్నిప్రతిష్ఠ, హోమం, స్వామివారలకు తిరుమంజన సేవ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు



కల్యాణానికి సిద్ధం చేసిన మండపం

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ (టీబీపీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుకుంట్ల రాజేశ్వరశర్మ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ హరిపురికాలనీలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రష్షేర్ హాస్పిటల్ వైద్యులు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శశిధర్, కొత్రాసతీష్, బి.ప్రశాంత్, పవన్, తాడేపల్లి వెంకటేశం గుప్తా, యాదిరెడ్డి, వంశీ, నెప్పల్లి శశిధర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి తుల్జాభవాని కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా రాత్లావత్ శంకర్‌లాల్, ప్రధాన కార్యదర్శిగా టి.శివకుమార్‌రెడ్డి, కోశాధికారిగా నినావత్ జీవన్‌కుమార్ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎస్.మురళీకృష్ణ, అనిల్, శంకర్, సహాయ కార్యదర్శిగా జంగయ్య, న్యాయ సలహాదారుడిగా లక్పతినాయక్, శివకుమార్, నవ్యానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



మంచాల: చెక్కు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి న్యామతాపూర్ గ్రామానికి చెందిన సంతోజు పరిపూర్ణచారి ఆరోగ్య సమస్యలతో నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.82 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం బాధితుడికి.. ఎమ్మెల్యే కసిరెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోదాస్ మహేశ్ తదితరులు ఉన్నారు.

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్ నాయక్ అన్నారు. అనారోగ్యంతో ఇటీవల చనిపోయిన లోయపల్లిగ్రామవాసి తోడుసునూటి లచ్చలుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయం కింద ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో రూ.60 వేలు మంజూరు అయ్యాయి. ఆదివారం లోయపల్లిలో బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేశారు. ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాం దాస్, నాయకులు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

జవాన్ల కోసం ప్రత్యేక పూజలు



జాతీయ జెండా చేతబూని సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: దేశ రక్షణ చేపడుతున్న జవాన్లకు మరింత ధైర్యాన్ని ఇవ్వాలని, వారిని చల్లంగా చూడాలని కోరుతూ ఆదివారం బాలాపూర్ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివర్ణపతాకాన్ని చేతబూని జవాన్లకు సంఘీభావం తెలిపారు. అనంతరం బీజేపీ కార్పొరేషన్–1 అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. యుద్ధం జరిగితే దేశ సైనికులు పరిపూర్ణ విజయం సాధించేలా చూడాలని భగవంతున్ని స్మరించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, వీరకర్ణారెడ్డి, నర్సింహారెడ్డి, గౌర శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కల్లెం లక్ష్మారెడ్డి, భార్గవ్‌రెడ్డి, రామిడి మహేందర్‌రెడ్డి, అరవింద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.25, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.17, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.80, బీట్‌రూట్ రూ.21, కీర రూ.40, బీన్స్ రూ.125, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నాయకులు

కడ్తాల్: గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 12,13 వార్డుల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం గూడూరు మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులను పూర్తి చేసి, వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు. మండలంలో సీడీఎఫ్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.30 కోట్లతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు శ్రీను, రమేశ్, భానుకిరణ్, మహేశ్, శ్రీకాంత్, రామకృష్ణ, నరేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

అబ్దుల్లాపూర్‌మెట్: ఆత్మీయ పలకరింపులు, భావోద్వేగాల నడుమ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009– 10 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు.. సుదీర్ఘ కాలం అనంతరం పాఠశాల వేదికగా సందడి చేశారు. బాల్యం జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. గురువులు రంగారెడ్డి, శ్రీనివాస్, యాదయ్య గౌడ్, జంగాచారి, గోదాదేవి, గీతా శ్యామల, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఖాజమోహిజుద్దీన్, సీఐ పవన్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. మున్సిపాలిటీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పీవీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ పోటీల్లో రెడ్డిపల్లి, అజీజ్‌నగర్ తలపడగా విజయం రెడ్డిపల్లిని వరించింది. రన్నర్‌గా అజీజ్‌నగర్ టీమ్ నిలిచింది. ఈ సందర్భంగా ప్రథమ విజేతకు రూ.లక్ష, రన్నర్‌కు రూ.50 వేల నగదును టోర్నీ నిర్వాహకులు పట్లోళ్ల బిందురెడ్డి, చెన్నారెడ్డి, సుజాతరెడ్డిలు అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అనంతరం టోర్నీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్, వ్యాపారవేత్త సత్తయ్య, ఏబీవీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఠాణా తరలింపు..

ఫార్మాసిటీ భద్రత కోసం నక్కర్తమేడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను కుర్మిద్దకు తరలించనున్నారు. అందరికీ అనుకూలంగా గ్రామాలకు మధ్య ఠాణా ఉండే విధంగా అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. త్వరలో తాత్కాలిక భవనంలోకి మార్చనున్నారు.

- కుర్మిద్ద తాత్కాలిక భవనంలోకి మార్పు
- ప్రస్తుతం నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న పీఎస్
- మార్పొద్దని గ్రామస్తుల ఆందోళన



నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా భూ సేకరణకు శ్రీకారం చుట్టింది. దీనిని వ్యతిరేకిస్తూ.. రైతులు ఆందోళనలు చేశారు. నిరసన కార్యక్రమాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫార్మా భద్రతకు స్థానికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అనుకున్నదే తడవుగా.. ఫార్మా భూములు సేకరించిన యాచారం, కందుకూరు మండలాల పరిధి 20 గ్రామాలు, వాటి అనుబంధ గ్రామాలను కలుపుతూ రాచకొండ కమిషనరేట్ పరిధి నక్కర్తమేడిపల్లిలో అద్దె భవనంలో ‘హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా’ను ఏర్పాటు చేసింది. ఒక సీఐ, ఎస్‌ఐలు, 30 మంది పోలీస్ సిబ్బందిని నియమించింది. ప్రస్తుతం పోలీసు పహారాలో నెల రోజులుగా ఫార్మా భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు కొనసాగుతున్నాయి.

పదిరోజుల్లో..

ఫార్మాసిటీ పీఎస్‌ను యాచారం మండలం కుర్మిద్దకు తరలించనున్నారు. గతంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసిన భవనంలోకి మార్చనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు జరుగుతుండగా.. సీఐ లిక్కి కృష్ణంరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజులు ఈ భవనాన్ని పరిశీలించారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి కానుండగా.. పది రోజుల వ్యవధిలో పీఎస్‌ను మార్చేందుకు పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

‘నెట్ జీరో సిటీ’గా..

గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్.. అవే భూముల్లో ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టింది. అయితే ఫార్మాను రద్దు చేసి, ఠాణా పేరు అదే ఉంటే ప్రజలు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని భావించిన పోలీసు యంత్రాంగం.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను పేరును ‘నెట్ జీరో సిటీ పీఎస్’గా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దీంతో కుర్మిద్దలోనూ పూర్వ పేరుతో ప్రజలకు సేవలు అందించాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. నక్కర్తమేడిపల్లి నుంచి పోలీస్ స్టేషన్ తరలించవద్దని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కుర్మిద్దలోని పీఎస్ ఏర్పాటుకు తాత్కాలిక భవనం

అందరికీ అందుబాటులో..



ఫార్మాసిటీ పీఎస్‌ను అందరికీ అందుబాటులో ఉండే విధంగా యాచారం మండలం మధ్యలో ఉన్న కుర్మిద్ద గ్రామానికి మార్చబోతున్నాం. అక్కడి తాత్కాలిక భవనంలో పీఎస్‌కు తగిన ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. పది రోజుల్లో ఠాణాను తరలిస్తాం. ఫార్మా పీఎస్‌ను నెట్ జీరో సిటీగా పేరు మార్చేందుకు ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించాం.

– లిక్కి కృష్ణంరాజు, సీఐ, ఫార్మాసిటీ పీఎస్